క్లుప్తంగా

రక్తపోటును నియంత్రించుకోవాలి

కాకినాడ రూరల్: అధిక రక్తపోటుతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని డాక్టర్ సువర్ణరాజు సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కోసం ఆందోళన, ఒత్తిడి, కోపతాపాలు, నిరాశ, నిస్పృహలు, ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల శరీరంలో పోటెత్తే నెత్తుటి వేగం అదుపు తప్పి అధిక రక్తపోటుకు దారితీస్తుందన్నారు. దీని నివారణకు శరీరక శ్రమతో పాటు ప్రతి రోజు నడక, వ్యాయామం వలన ప్రయోజనం ఉంటుందన్నారు. బీపీ ఉన్న వారు మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లతో జీవితం నాశనం

కాకినాడ రూరల్: కొందరు యువకులు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, బెట్టింగ్‌లో సొమ్ములు కోల్పోయి దొంగలుగా మారి దోపిడీలకు పాల్పడుతున్నారని న్యాయవాది యనమల రామం ఆవేదన వ్యక్తం చేశారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తుండడంతో తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్నప్రసాద్, దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో 23 చిత్ర యూనిట్ సందడి



కాకినాడలో సందడి చేసిన 23 చిత్ర యూనిట్

బోట్‌క్లబ్: కాకినాడలోని తిరుమల థియేటర్‌లో 23 చిత్ర యూనిట్ సందడి చేసింది. శనివారం చిత్ర నటీనటులు తేజ రాయపాటి, తన్మయి, దర్శకులు ప్రేక్షకులతో కలసి చిత్రాన్ని చూసి వారితో ముచ్చటించారు. చిలకలూరిపేట ఘటన ఆధారంగా చిత్రాన్ని చిత్రీకరించినట్లు దర్శకుడు రాజ్ రచ్చకొండ చెప్పారు. ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. స్పిరిట్ మీడియా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించినట్లు చెప్పారు.

చెక్ బౌన్స్ కేసులో 6 నెలల జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి 6 నెలల జైలు, రూ.8.68 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిరూప భంజ్ డియో తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడకు చెందిన జామి మరిడియ్య వద్ద నుంచి ప్రత్తిపాడుకు చెందిన యాళ్ల జగదీష్ అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు రూ.8.68 లక్షలకు చెక్కు ఇచ్చారు. చెక్కును మరిడియ్య బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. విచారణలో జగదీష్‌పై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

బాలాజీచెరువు: మహర్షి సాంబమూర్తి దివ్యాంగుల బాలికల ఆశ్రమ పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫ్యాన్లు బహూకరించింది. సూర్యారావుపేట, మధురానగర్, కాకినాడ శాఖలకు చెందిన సిబ్బంది ఆరు వాల్‌ఫ్యాన్లను విద్యార్థులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బందిని పాఠశాల కార్యవర్గ సభ్యులు అల్లూరి సురేంద్రబాబు అభినందించారు.

ఐటీఐ అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

బాలాజీచెరువు: సీమెన్స్, టాటా స్ట్రైవ్‌లో భాగంగా ఐటీఐ అధ్యాపకులకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రాజమహేంద్రవరం, భీమవరం, ఏలూరు, గుడివాడ ఐటీఐలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇవ్వడానికి అధ్యాపకులను సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారని, ఈ శిక్షణ ఐటీఐల అభివృద్ధితో పాటు పరిశ్రమలకు స్కిల్ టెక్నీషియన్లను అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ అక్షయ్ అజత్కర్, మార్కండేయులు, సంతోష్, ఎంఎస్‌మూర్తి పాల్గొన్నారు.

ఈ ప్రయాణం ప్రమాదమే!

- శిథిలమైన వంతెనతో అవస్థలు
- రక్షణ గోడలు సైతం ధ్వంసం
- ఆదమరిస్తే పైనుంచి పడే అవకాశం
- మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రజలు



కరప నక్కావారి ఎస్సీవీధి వద్ద పంటకాలువపై రక్షణ గోడలు పడిపోయి బోడిగా కనిపిస్తున్న వంతెన

కరప: స్థానిక నక్కావారి ఎస్సీ వీధి, అగ్నికుల క్షత్రియుల వీధికి వెళ్లే రహదారిలోని పంటకాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించే ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. వంతెన శిథిలమైనా, ఇరువైపులా రోడ్డు కోసుకుపోయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రామంలోని ఈ రెండు వీధులకు వెళ్లాలంటే న్యూభీమన్న కర్ర పంటకాలువ దాటి వెళ్లాలి.



వంతెన అడుగు భాగంలో పెచ్చులూడి కనపడుతున్న ఇనుప ఊచలు

తహసీల్దార్ కార్యాలయం నుంచి కిలోమీటరు లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ వీధుల్లోని ప్రజలు గ్రామంలోకి రావాలన్నా అవస్థలు ఎదుర్కొనక తప్పని పరిస్థితి నెలకొంది. చాలా కాలం క్రితం వంతెన నిర్మించడంతో దాని రక్షణ గోడలు సైతం ధ్వంసమయ్యాయి. పాదచారులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు పక్కకు వెళ్తుంటే అదుపు తప్పి కాలువలో పడిపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అగ్నికులక్షత్రియుల వీధి వరకు రోడ్డు నిర్మించి, వంతెనను పట్టించుకోకుండా వదిలేశారు. ప్రాణాపాయం జరగకముందే అధికారులు స్పందించి వంతెన నిర్మించి, కోసుకుపోయిన రోడ్డును పునర్నిర్మించాలని ఆయా వీధుల ప్రజలు కోరుతున్నారు.



పంటకాలువపై వంతెనకు ఒకవైపు కోసుకుపోయిన రహదారి అంచు

వంతెన నిర్మించాలి



పంటకాలువపై ఉండే వంతెన నిర్మించి చాలా కాలం కావడంతో అడుగుభాగంలో పెచ్చులుగా ఊడిపడిపోతోంది. వంతెన పైభాగంలో ఉండే రక్షణగోడలు పడిపోయాయి. కిందిభాగంలో శ్లాబు పెచ్చులూడి పడిపోయి, ఊసలు బయటకు వచ్చాయి. ఈ వంతెనతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నాం. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– నవరపు పెదపాపారావు, నక్కావారి ఎస్సీవీధి, కరప

కాలువలో పడిపోతున్నారు



వంతెనపై భాగంలో ఇరువైపులా రక్షణగోడలు పడిపోయాయి. వంతెన అడుగున కూడా ముక్కలుగా పెచ్చులు ఊడిపడిపోతున్నాయి. వంతెనకు ఒకపక్క రోడ్డు కోసుకుపోయింది. వంతెనపై నుంచి రాకపోకలు సాగించేందుకు ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునేందుకు ఖాళీలేక అదుపుతప్పి పడిపోతున్నారు. వంతెన నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు.

– దండంగి శ్రీనివాస్, ఎస్సీవీధి, కరప

పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు
- కలెక్టరేట్ ఆవరణలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్

కాకినాడ సిటీ: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు కోరారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్‌లో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఉష్ణతాపం నుంచి ఉపశమనం కలిగించే లక్ష్యంతో ఈ నెల స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ రోజు నుంచి నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో వేడి నుంచి రక్షణ పొందే మార్గాలు, వడదెబ్బపై అవగాహన, నివారణ చర్యలను సూచించడం, చలివేంద్రాల ఏర్పాటు, మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పశుపక్ష్యాదులకు సైతం తాగు నీరు అందించే ఏర్పాటు చేయాలని కోరారు. చెట్లు వాతావరణ తాపాన్ని తగ్గిస్తాయని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే ఆరోగ్యకరంగా ఉంటారని డీఆర్వో వెంకటరావు సూచించారు. కలెక్టరేట్‌లో మొక్కలకు అందరూ నీరు పోశారు. అక్కడి ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఆర్వో ప్రారంభించి, ప్రజలకు మంచినీటిని అందించారు. స్వచ్ఛాంధ్ర దివస్ సందర్భంగా క్లాప్ మిత్రులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ ఏవో రామ్మోహనరావు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర దివస్ సందర్భంగా క్లాప్ మిత్రులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లను సన్మానిస్తున్న డీఆర్వో తదితరులు

వడగాడ్పులతో అప్రమత్తం

కరప: వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయని, వడగాడ్పుల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేసి అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యాలయం సిబ్బందితో కలసి ఆమె శ్రమదానం చేశారు. అనంతరం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఏఓ బీఎల్ నరసింహం, ఏపీఓ వై.హేమమాధవి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

మండల పరిధి గ్రామాల్లో వడదెబ్బ, వడగాడ్పులపై ప్రజలకు అవగాహన కల్పించి, పంచాయతీల వద్ద, బహిరంగ స్థలాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఆయన కరప, కొరుపల్లి, పెనుగుదురు తదితర గ్రామాల్లో పర్యటించి బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులకు నీళ్లతొట్టెలు నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. కొరిపల్లిలో పశువులకు నీళ్లతొట్టె నిర్మాణానికి భూమిపూజ చేశారు. వివిధ గ్రామాల్లో కార్యదర్శులు, సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బందిచే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పలివెల నాగేశ్వరరావు, నక్కా బాబులు, నాగిరెడ్డి ఏసుబాబు, మారెళ్ల శివ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర

కాకినాడ రూరల్: ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు, సిబ్బంది శనివారం ఉదయం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ భవాని, వీఆర్వోలు నున్న సత్యనారాయణ, తాతారావు, శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

గ్లోబల్ వార్మింగ్‌తో పెనుముప్పు

కాకినాడ క్రైం: గ్లోబల్ వార్మింగ్‌తో మానవాళి మనుగడకు పెనుముప్పు వాటిల్లనుందని రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తులూరి విష్ణువర్ధన్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం కళాశాలలో 'బీట్ ది హీట్'పై సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి, హెచ్‌డీఎస్ సభ్యుడు లక్ష్మణ్ సహా వివిధ విభాగాల అధిపతులు, బోధకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



కరప ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలసి మొక్క నాటుతున్న ఎంపీడీఓ అనుపమ

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్: వ్యక్తిత్వ వికాస సమాజం, గ్లోబెల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వేసవి విశిష్ట మనోవిజ్ఞాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు జ్యోతిర్మనో విజ్ఞాన సంస్థ ప్రతినిధి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి శనివారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 21 నుంచి 30 వరకూ స్థానిక జీపీటీ మెహర్‌నగర్‌లోని వాధూలసంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటలకు వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ప్రముఖ సైకాలజిస్టులు వి.జనార్దనం, ఎస్.మహాలక్ష్మీకుమార్, వి.మనోహర్, ఎ.ఉదయభాస్కర్, సి.సుబ్బరాజు, హైమ, కేశవాచార్యులు, కె.సుబ్బారావు, అక్కింశెట్టి రాంబాబు, బి.లక్ష్మీనారాయణ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 94415 63789 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సికిల్ సెల్ నివారణకు స్క్రీనింగ్

కాకినాడ సిటీ: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సికిల్ సెల్ వ్యాధుల నివారణ, నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశం శనివారం కాకినాడ కోర్టుహాలులో ఆర్డీవో వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. 0-40 సంవత్సరాల ఉన్న వ్యక్తులను సర్వే చేసి సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్ చేస్తారని డీఆర్వో తెలిపారు. సమావేశంలో డీఎల్‌టీవో డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్లు ఐ.ప్రభాకర్, ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ విల్సన్, ఇన్‌చార్జి ఎపిడమాలజిస్ట్ డాక్టర్ బి.రవికుమార్, జీజీహెచ్, విద్యాశాఖ, ఐసీడీఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లీజు వేలం సకాలంలో నిర్వహించాలి

బోట్‌క్లబ్: నగరంలోని దేవాదాయశాఖకు చెందిన సత్రాలు, ఆలయాలకు సంబంధించి భూములు, షాపుల లీజు వేలం సకాలంలో నిర్వహించాలని ఆశాఖ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నారు. కాకినాడలోని డీసీ కార్యాలయంలో శనివారం సత్రం, దేవాలయాల ఈఓలతో సమావేశం నిర్వహించారు. లీజు వేలం గడువు ముగిసే లోపు అయా భూములు, షాపులకు దేవదాయశాఖ నిబంధనల మేరకు లీజు వేలం నిర్వహించాలన్నారు. సకాలంలో లీజు చెల్లించని షాపులు, భూములను స్వాధీనం చేసుకుని వాటికి మళ్లీ లీజు వేలం నిర్వహించాలన్నారు. దేవదాయశాఖకు చెందిన ఆస్తులు ఆక్రమణకు గురైతే సంబంధిత ఈవోలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములు తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు అవసరమైతే కోర్టులో కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవదాయశాఖాధికారి ఈవీ సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీఓగా హేమమాధవి



కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధిహామీ పథకం మండల ఇన్‌చార్జ్ ఏపీఓగా యండమూరి హేమమాధవి బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన ఏపీఓ జీవీ రమణకుమార్ గత నెలలో జగ్గంపేట మండలానికి బదిలీ కావడంతో కాకినాడ రూరల్ మండలంలో జేఈగా పనిచేస్తున్న హేమమాధవిని ఇక్కడ ఇన్‌ఛార్జ్ ఏపీఓగా నియమించారు. వేసవిలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి, నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరు

- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్



కాకినాడ రూరల్: ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ ద్వారా పోరు సాగిస్తామని ఆ పార్టీ ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్ పేర్కొన్నారు. మండలంలో చీడిగ గ్రామానికి చెందిన గణేష్‌కు జిల్లా కమిటీలో స్థానం కల్పించడంతో శనివారం మీడియా వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు. తనకు మాజీ మంత్రి, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కురసాల కన్నబాబు ప్రోద్బలంలోనే పదవి లభించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై పార్టీ పరంగా పోరాడతామన్నారు. గణేష్‌తో పాటు నియోజకవర్గం నుంచి పలువురికి పదవులు లభించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమయింది. పార్టీ జనరల్ సెక్రటరీగా కరప మండలానికి చెందిన పబ్బినీడి పాపారావు, ఆర్గనైజరీ సెక్రటరీలుగా సర్పవరానికి చెందిన పుల్ల ప్రభాకరరావు, 50వ డివిజన్‌కు చెందిన ఐ.శ్రీను, సెక్రటరీ యాక్టివిటీగా కరప మండలానికి చెందిన కామాడి భీమ శంకర్, ఆఫీషియల్ స్పోక్స్‌మెన్‌గా కాకినాడ రూరల్‌కు చెందిన అనుసూరి ప్రభాకర్ నియమితులవ్వడంతో నియోజకవర్గంలో పార్టీ నాయకులు అభినందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తామని, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పటిష్టానికి పాటు పడాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కురసాల కన్నబాబు కోరారు.

సాధనతోనే విజయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సాధనతోనే విజయం లభిస్తుందని శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ పేర్కొన్నారు. శ్రీ ప్రకాష్ పాఠశాలలో ప్లస్‌టూ విద్యార్థులకు ది సెవెన్ హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్ పుస్తకంపై సెమినార్ నిర్వహించారు. ఈ పుస్తకాన్ని స్టీఫెన్ కోవి రచించారని, ఇది వ్యక్తిగత అభివృద్ధి, నాయకత్వం, సమర్థవంతమైన జీవనశైలిలో రాసారన్నారు. ఈ పుస్తకాన్ని చదవడం వల్ల వ్యక్తి ప్రవర్తనలో ఎటువంటి మార్పు పొందగలడో, కలిసి పనిచేయడం వల్ల కలిగే లాభాలు వివరించారని విజయప్రకాశ్ పేర్కొన్నారు.

'కోరమండల్'ను సందర్శించిన మంత్రి



పరిశ్రమల్లో భద్రతా చర్యలపై సమీక్షిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ రూరల్: వాకలపూడిలోని కోరమాండల్ ఎరువుల కర్మాగారాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం సందర్శించారు. కార్మికులతో మాట్లాడి, వారికి అందుతున్న సదుపాయాలు, సమస్యల గురించి తెలుసుకున్నారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కాకినాడ సమీపంలోని పరిశ్రమల నిర్వాహకులతో భేటీ నిర్వహించి, భద్రతా చర్యలపై చర్చించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాక్-ఎ హోదా సాధనకు కృషి

- పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఆంజనేయులు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఫిలాసఫీ అధ్యాపకుడు డాక్టర్ కందుల ఆంజనేయులును నియమిస్తూ కళాశాల ఉన్నత విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శనివారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1996లో ఇదే కళాశాలలో ఫిలాసఫీ అధ్యాపకునిగా చేరి 2017 వరకూ పనిచేసి రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లారు. అక్కడ 2023 వరకూ పనిచేసి తిరిగి ఇదే కళాశాలకు బదిలీపై వచ్చి వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2019లో ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం అదృష్టమని, అందరి కృషితో న్యాక్-ఏ గ్రేడ్ సాధిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అధ్యాపకులు డాక్టర్ హరిరామప్రసాద్, జాన్ శామ్యూల్, లక్ష్మణ్, విజయ్‌కుమార్, వర్మ, నాగేశ్వరరావు, ఏవో రాజు అభినందించారు.

కార్మికుల సమ్మెకు కౌన్సిల్ సంఘీభావం

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు శనివారం పట్టణ కౌన్సిల్ సంఘీభావం తెలిపింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 10 రోజులుగా రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలియజేసి రూ.13 వేల జీతం చేతికి వస్తే పెరిగిన ధరలతో ఏ విధంగా జీవిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని ఆయన హామీ ఇచ్చారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా సహకరించాలని వైస్ చైర్మన్ కార్మికులకు సూచించారు. ఈ మేరకు కార్మికుల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు కౌన్సిల్ సభ్యులతో మాట్లాడుతూ 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగ వైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్, యార్లగడ్డ జగదీష్, మర్రి శేషారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, కానేటి బుల్లి అప్పారావులు పాల్గొన్నారు. సమ్మెలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్మికులు పాలకుల మనసు మారి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

కరపలో తిరంగా ర్యాలీ



కరపలో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

కరప: కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం కరపలో కూటమి నాయకులతో కలిసి యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. బాల, బాలికలు, కూటమి నాయకులు జాతీయ జెండాలను చేతపట్టి ఉప్పాలమ్మతల్లి గుడి నుంచి మార్కెట్ సెంటర్‌వరకు నినాదాలు చేస్తూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సైనిక దుస్తులతో చిన్నారుల కవాతు, భరతమాత, వీరనారీమణుల వేషధారణలతో చిన్నారులు కారుపై కూర్చుని నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మండల బీజేపీ అధ్యక్షురాలు ఎర్రంనీడి పద్మావతి, అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి తదితరులు పాల్గొన్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి



నడకుదురులో సమావేశమైన పీఆర్టీయూ నాయకులు

కరప: టీచర్ల బదిలీలలో అసంబద్ధతలను తొలగించాలని ఈనెల 21న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక తలపెట్టిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా సీపీఎస్ కన్వీనర్ వాకాడ వెంకటరమణ, పీఆర్టీయూ జిల్లా ప్రెసిడెంట్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ కోరారు. మండలం నడకుదురు కమ్యూనిటీ హాలులో జరిగిన పీఆర్టీయు సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా బదిలీలు చేయడాన్ని నిరసిస్తూ గుర్తింపు పొందిన 9 ఉపాధ్యాయ సంఘాలతో ఈ ఆందోళన కార్యక్రమం జరుగుతోందన్నారు. పీఆర్టీయు జిల్లా కార్యదర్శి బండి నూకరాజు, కరప మండల అధ్యక్ష,కార్యదర్శులు పి.నాగేశ్వరరావు, బి.మంగారావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం కోరల్లో 'ఏలేరు'

- రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి
- ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసిన రైతు కూలీ, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రతినిధులు

సామర్లకోట: చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి వనరైన ఏలేరు కాలువ పరిశ్రమల వ్యర్థాలతో కలుషితమవుతోందని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆరోపించారు. ఏలేరు కాలువను కాలుష్యం నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. పెద్దాపురం మండల పరిధిలోని అనేక పరిశ్రమలు, రొయ్యల పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలు ఏలేరు కాలువలో పంట పొలాల దెబ్బతింటున్నాయని, పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో చెరువులలో నీరు లేకపోవడం వల్ల పశువులు ఏలేరు కాలువలో నీటిని తాగుతున్నాయని వివరించారు. పరిశ్రమల నుంచి అధికారులు ముడుపులు అందుకోవడం వల్లే రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పరిశ్రమలను అధికారులు పర్యవేక్షించి భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, కుంచే అంజిబాబు, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.